సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



అనుగ్రహించే తల్లి లూర్దుమాత

లూర్దుమాత మానవాళిని పరిపూర్ణంగా అనుగ్రహించే తల్లి అని బద్వేలు విచారణ గురువులు రెవ ఫాదర్ గొడుగునూరు విజయరావు అన్నారు. -8లో



ప్రవీణ్ డబుల్ ఓట్ల తొలగింపు

టీడీపీ నేతల డబుల్ ఓట్లను అధికారులు తొలగించారు. టీడీపీ నేత ప్రవీణ్ కుమార్‌రెడ్డి ప్రొద్దుటూరులోనే ఓటు ఉంచుకుని కోగటం గ్రామంలో రద్దు చేసుకున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
34.4/23.6

వాతావరణం

జిల్లాలో శనివారం 23.6 - 34.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీ 97.16 శాతం



కడపకు చెందిన షేక్ ఖాదర్‌సాబ్‌కు పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ సరస్వతి

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక కింద పింఛన్ల పంపిణీ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది మూడో రోజైన శనివారం మొత్తం 2,68,881 పింఛన్లకు 2,61,255 మందికి పింఛన్లను అందజేశారు. దీంతో 97.16 శాతం నమోదైంది. కాగా పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో జిల్లా 5వ స్థానంలో నిలిచింది. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లను పంపిణీ చేయడం పట్ల పింఛన్లను పొందుతున్న వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రొద్దుటూరు వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రథమ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. శనివారం వైవీయూలో వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రొద్దుటూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి. నాగరాజు, డీన్ ఆచార్య కె.రమణయ్య, వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డిలతో కలిసి ఫలితాలను విడుదల చేశారు. సివిల్, సీఎస్ఈ, ఈఈఈ, ఈసీ ఈ, ఎంఈ, ఎంఎంటీ బ్రాంచ్‌లలో 240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 196 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. 81.66 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. సివిల్‌లో 85.71 శాతం, కంప్యూటర్ సైన్స్‌లో 90.90, ఈఈఈలో 74.41, ఈసీఈలో 65.21, ఎంఈలో 78.78, ఎంఎంటీలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఉపాధి కల్పనకు ప్రణాళిక

- 2024-25 ఆర్థిక సంవత్సరానికి కసరత్తు
- రూ.448.80 కోట్ల అంచనా వ్యయం
- గ్రామసభల ద్వారా పనుల గుర్తింపు
- మార్చి చివరి నాటికి 73 లక్షల పనిదినాల లక్ష్యం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కడప సిటీ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని వేతన జీవులకు మరింత జీవనోపాధి కల్పించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి గతేడాది కంటే రూ. 115 కోట్ల తేడాతో అంచనా వ్యయంగా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ సిబ్బంది గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించనున్నారు.

2023–24 ఆర్థిక సంవత్సరంలో..

2023–24 ఆర్థిక సంవత్సరం గతేడాది ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కాగా, ఈ ఏడాది మార్చి చివరి నాటికి పూర్తవుతుంది. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 73 లక్షల పనిదినాలు కల్పించాలన్నది ప్రధాన లక్ష్యం. ఇందుకుగాను రూ. 73.50 లక్షలు వేతనాలకు ఖర్చు చేయాలని నిర్ణయించారు. అయితే ఇప్పటివరకు 73.50 లక్షల పనిదినాలు నమోదయ్యాయి. ఈ మార్చి చివరి నాటికి లక్ష్యాన్ని చేరుకునేందుకు క్షేత్ర స్థాయిలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మెటీరియల్‌కు సంబంధించి రూ. 133.28 కోట్లు ఖర్చు చేశారు. మొత్తం కలిపి రూ. 333.20 కోట్లు ఆ ఆర్థిక సంవత్సరానికి కేటాయించారు. 2023–24 సంవత్సరంలో వేతన జీవుల జీవనోపాధికి ఉపాధి పథకం ఎంతగానో ఉపయోగపడింది. ప్రస్తుతానికి 1,43,524 కుటుంబాలకు పని కల్పించారు. ఇందులో 2,28,410 మంది వేతన జీవులు పనులకు హాజరై ఉపాధి పొందారు. 73 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా, ఇంతవరకు 70 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. మార్చి చివరి నాటికి 2.5 లక్షల పనిదినాలను పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటివరకు కూలీలకు రూ. 173.61 కోట్లు ఖర్చు చేశారు.2023–24కు సంబంధించి మెటీరియల్‌కు రూ. 133.28 కోట్లు కేటాయించారు. ఈ మొత్తంతో సిమెంటు రోడ్లు, మెటల్‌రోడ్లు, భవనాల పనులు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు, బల్క్‌మిల్క్ సెంటర్లు తదితర పనులు చేశారు.

గ్రామసభల ద్వారా పనుల గుర్తింపు

ఉపాధిహామీ పథకంలో ప్రజల అభీష్టం మేరకు ఉపయోగపడే పనులను మాత్రం చేపడతారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహించి అవసరమున్న పనులను క్షేత్ర స్థాయిలో గుర్తించి జిల్లా స్థాయి అధికారులకు నివేదికలను పంపుతారు.



వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ రూ. 448.80 కోట్లు

2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ. 448.80 కోట్లతో ఉపాధిహామీ పనులను నిర్వహించేందుకు అంచనా బడ్జెట్‌ను సిద్ధం చేశారు. గ్రామసభల ద్వారా గుర్తించిన పనులను చేపట్టనున్నారు. 99 లక్షల పనిదినాలు చేయాలని లక్ష్యంగా ఎంచుకున్నారు. ఇందుకుగాను రూ. 269 కోట్లు వేతన జీవులకు ఖర్చు చేయనున్నారు. అలాగే మెటీరియల్‌కు సంబంధించి రూ. 179.52 కోట్లు వెచ్చించాలని నిర్ణయించారు. ఈ నిధులతో సిమెంటు రోడ్లు, మెటల్‌రోడ్లు, భవనాల పనులు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు, బల్క్‌మిల్క్ సెంటర్ల పనులు చేపట్టనున్నారు. ప్రధానంగా నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇస్తారు. కొత్తగా ఫోకస్ ఏరియా వర్క్స్ పేరిట వివిధ రకాల పనులను నిర్వహించనున్నారు.

- వచ్చే ఆర్థిక సంవత్సరానికి కొత్త విధానంతో పనులను చేపట్టనున్నారు. ఫోకస్ ఏరియా వర్క్స్ పేరిట పనులు చేపడతారు. చిన్నచిన్న చెరువులు, డకౌట్ ఫాండ్స్, ఫారం పాండ్స్ విత్ బండింగ్, గోకుల షెడ్లు, గొర్రెల షెడ్లు, సోప్ ఫిట్స్, వివిధ రకాల ప్లాంటేషన్ పనులు ఈ విధానంలో చేపట్టనున్నారు.

లక్ష్యాన్ని అధిగమించేందుకు చర్యలు



2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. వచ్చే ఆర్థిక సంవత్సరానికి కూడా బడ్జెట్ అంచనా వ్యయం ఖరారైంది. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పనుల నిర్వహణపై నిఘా పెడుతున్నాం.

–యదుభూషణరెడ్డి, డ్వామా పీడీ, కడప

క్షేత్ర స్థాయిలో సమీక్షలు



ఉపాధిహామీ పథకంపై ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో సమీక్షలు నిర్వహిస్తున్నాం.ఉన్నతాధికారులతో పనుల పురోగతిపై చర్చిస్తున్నాం. ఈ పథకం గ్రామీణ ప్రాంత ప్రజలకు అన్ని విధాలా ఉపయోగపడేలా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. – విజయరామరాజు, జిల్లా కలెక్టర్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న అయితా నాగేశ్వరరావు

కడప అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో కార్యక్రమాలను చేపడుతోందని జిల్లా వ్యవసాయాధికారి అయితా నాగేశ్వరరావు పేర్కొన్నారు.శనివారం ఊటకూరులోని ఏఆర్ఎస్ సెంటర్‌లో ఆత్మ ఆధ్వర్యంలో వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఆర్‌బీకే సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాలు(ఆర్‌బీకే) నాలెడ్జ్ సెంటర్లుగా తయారు కావాలని, రైతులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని అన్నారు. ఆర్‌బీకే సిబ్బంది పంటలపైన శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలను రైతులకు తెలియచేయాలన్నారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి, కేవీకే ఆర్డినేటర్ వీరయ్య, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసచారి మాట్లాడారు.శాస్త్రవేత్తలు సునీల్, మానస పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌సీ డీడీ రమణారెడ్డి, డీఆర్‌సీ ఏడీ పద్మజ, శైలజ, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

కలికిరి మండలంలో ఏనుగుల సంచారం

కలికిరి: రెండు రోజుల కిందట అన్నమయ్య జిల్లా సోమల మండలంలో ఏనుగుల జంట సంచరించింది. ఈ ఏనుగులు శనివారం రాత్రి కలికిరి, వాల్మీకిపురం మండలాల సరిహద్దు ప్రాంతమైన గుట్టపాళెం, మేకలవారిపల్లి అటవీప్రాంతం ఎర్రగుంట్లబావి ప్రాంతానికి చేరుకున్నట్లు అటవీశాఖ సెక్షన్ అధికారి(ఎఫ్ఎస్ఒ) సుధాకర్ తెలిపారు. చుట్టు పక్కల గ్రామాగ్రామాల ప్రజలు, ముఖ్యంగా రైతులు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే ఎనుగుల సంచారం సమాచారం రైతులు, పశువుల కాపరులకు తెలియచేసి అప్రమత్తం చేయాలని వలంటీరకు పంచాయతీ కార్యదర్శులు ఆదేశాలు ఇచ్చారు

నేడు ప్రపంచ కేన్సర్ డే

- రిమ్స్‌లో అధునాతన వైద్య సేవలు
- రూ.107 కోట్లతో 100 పడకలతో కేన్సర్ కేర్ సెంటర్ నిర్మాణం

మహమ్మారిపై సమరం



రిమ్స్ ఆవరణలోని డాక్టర్ వైఎస్ఆర్ కేన్సర్ కేర్ సెంటర్

కడప అర్బన్: కేన్సర్ మహమ్మారిని పారదోలేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ కేన్సర్ కంట్రోల్ (యూఐసీసీ) వారు ప్రపంచ కేన్సర్‌డేగా 2000 ఫిబ్రవరి 4 నుంచి ప్రతి ఏడాది నిర్వహిస్తున్నారు. కడప లోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏడాదికాలం నుంచి ఓపీ విభాగంలో కేన్సర్ వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. జనరల్ సర్జరీ విభాగం, రేడియేషన్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ, మెడికల్ అంకాలజీ విభాగాల వారు వైద్య సేవలను అందిస్తున్నారు.

కేన్సర్ కేర్ సెంటర్ .. రాష్ట్రానికే తలమానికం

కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో డాక్టర్ వైఎస్ఆర్ కేన్సర్ కేర్ సెంటర్‌ను రూ. 107 కోట్ల వ్యయంతో నిర్మించారు. 100 పడకల సామర్థ్యంతో పూర్తి చేశారు. గత డిసెంబర్ 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కడప రిమ్స్ ఆవరణలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మానసిక వైద్యశాల, డాక్టర్ వైఎస్ఆర్ కేన్సర్ కేర్ హాస్పిటల్‌లను నిర్మింపచేసి ప్రారంభించారు. కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ కేన్సర్ హాస్పిటల్‌లో వారం రోజుల్లో ఓపీ సేవలు ప్రారంభమవుతాయి. ఐపీ సేవలు ఈనెలాఖరున ప్రారంభమవుతున్నాయి. ఇప్పటివరకు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జనరల్ సర్జరీ విభాగంతో పాటు, ప్రత్యేకంగా కేన్సర్ ఓపీ విభాగంలో వైద్య పరీక్షలు చేపడుతున్నారు. ప్రతి రోజూ ఓపి విభాగానికి 10 నుంచి 20 వస్తున్నారు. కేన్సర్ కేర్ హాస్పిటల్‌లో ఐపీ విభాగంలో సర్జికల్ అంకాలజీలో 35 పడకలు, మెడికల్ అంకాలజీలో 35 పడకలు, రేడియేషన్ అంకాలజీలో 35 పడకలు, ఐసీయు కేర్ యూనిట్‌తో కలిసి 140 పడకలను ఏర్పాటు చేయనున్నారు. కేన్సర్ వ్యాధి గ్రస్తులకు సర్జరీ, రేడియోథెరఫీ, కీమోథెరఫీల ద్వారా వైద్య సేవలను అందించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తిరుపతి, కర్నూలు, అనంతపురం, వైజాగ్, గుంటూరులలోని ప్రభుత్వ వైద్యకళాశాల, వైద్య శాలలో కేన్సర్ ఓపీ, ఐపీ విభాగాలను నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలోనే తలమానికంగా రిమ్స్‌లో వైద్య సేవలను అందించనుంది. ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె. వాణి, సర్జికల్ అంకాలజీ హెచ్‌ఓడిగా డాక్టర్ అమానుల్లా, రేడియేషన్ అంకాలజీ హెచ్ఓడిగా డాక్టర్ ప్రవీణ వ్యవహరిస్తున్నారు.

కేన్సర్ సెంటర్ ఏర్పాటు అభినందనీయం



కడపలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో డాక్టర్ వైఎస్ఆర్ కేన్సర్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయం. భవిష్యత్తులో కేన్సర్ వ్యాధి గ్రస్తులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడ ఉపశమనం పొందేలా అన్ని చర్యలు తీసుకుంటాం. – కె. వాణి, సూపరింటిండెంట్, వైఎస్ఆర్ కేన్సర్ కేర్ సెంటర్

జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలి

- చంద్రబాబు, పవన్ మాటలు నమ్మి మోసపోవద్దు
- అక్కచెల్లెమ్మలతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



డ్వాక్రా మహిళలకు మెగా చెక్కును అందజేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

చక్రాయపేట: ముఖ్యమంత్రిగా జగనన్న మళ్లీ వస్తే అక్కచెల్లెమ్మలకు మరిన్ని సంక్షేమ పథకాలు వస్తాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత మొత్తాన్ని అక్కచెల్లెమ్మలకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన ఎంపీ మాట్లాడుతూ 2019 ఎన్నిక ల సమయంలో జగనన్న డ్వాక్రా మహిళలు ఆ రోజుకు ఎంత బకాయిలు ఉన్నారో వాటిని నాలుగు విడతల్లో ఇస్తానని చెప్పిన మాటకు కట్టుబడి నేటితో ఆ మొత్తాన్ని మీకు చెల్లించారని చెప్పారు. చంద్రబాబు, ప్యాకేజీ పవన్‌లు బాబు వస్తే జాబు వస్తుంది.. మీరు బ్యాంకు బకాయిలు కట్టొద్దు, మాఫీ చేస్తాను..మీ బంగారు నగలు నేనే విడిపిస్తానని మాయ మాటలు చెప్పి మోసం చేసిన విషయాన్ని మహిళలు గుర్తుకు తెచ్చు కోవాలన్నారు.ఇప్పుడు మళ్లీ మరో కొత్త నాటకంతో మీభవిష్యత్తుకు బాబు గ్యారంటీ అంటూ మోసం చేసేందుకు వస్తున్నారని, వాళ్ల మాయ మాటలను నమ్మి మోసపోవద్దని చెప్పారు. జగనన్న అధికారం లోకి వచ్చాక అమ్మఒడి,విద్యాదీవెన,వసతి దీవెన, విద్యాకానుక, గోరుముద్ద,విదేశీ విద్యాదీవెన వంటి పథకాలు ప్రవేశపట్టి ప్రతి ఒక్కరికీ అండగా నిలిచారని చెప్పారు. నిత్యం మనకోసం తపించే మన సీఎం జగనన్నను మళ్లీ అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, అందరూ ఆశీర్వదించాలని కోరారు.అనంతరం ఎంపీ చేతుల మీదుగా మండలంలో 473 సంఘాల్లో ఉన్న 4643 మంది డ్వాక్రా మహిళలకు వైఎస్ఆర్ ఆసరా కింద మంజూరైన రు.3,09,38,850ల మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డి, మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి,ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి, కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు ప్రసాదరావు, సభాపతినాయుడు,సర్పంచ్ హర్షద్,ఎంపీటీసీ లీలా వతి, ఎంపీడీఓ శివారెడ్డి,డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్,ఏరియా కో ఆర్డినేటర్ నీలకంఠారెడ్డి,ఏపీఎం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు కప్పు అందజేస్తున్న అతిథులు







కమలాపురం, జమ్మలమడుగు, సిద్ధవటం జట్ల క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

'ఆడుదాం ఆంధ్ర' చాంపియన్స్‌కు బహుమతులు

కడప స్పోర్ట్స్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' జిల్లాస్థాయి పోటీల్లో పలు జట్లు విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధమయ్యాయి. జిల్లాస్థాయిలో చాంపియన్‌లుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, నగదు పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమంల శనివారం నిర్వహించారు. కడపలోని డీఎస్ఏ క్రీడామైదానంలో నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ విచ్చేసి విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం సత్తాచాటి చాంపియన్‌లుగా నిలవాలన్నారు. డీఎస్‌డీఓ కె. జగన్నాథరెడ్డి మాట్లాడుతూ ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు వైజాగ్‌లో రాష్ట్రస్థాయి పోటీలు జరగుతాయని తెలిపారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. అనంతరం క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సూర్యనారాయణరావు, మల్లికార్జున కిరణ్, కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

విజేతల వివరాలు..

(ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు)

బ్యాడ్మింటన్ పురుషులు : కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు

బ్యాడ్మింటన్ మహిళలు: కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు

క్రికెట్ పురుషులు: ప్రొద్దుటూరు, కమలాపురం, జమ్మలమడుగు

క్రికెట్ మహిళలు: పులివెందుల

కబడ్డీ పురుషులు: బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు

కబడ్డీ మహిళలు: పులివెందులు, మైదుకూరు, కమలాపురం

ఖోఖో పురుషులు: కమలాపురం, మైదుకూరు, జమ్మలమడుగు

ఖోఖో మహిళలు: జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు

వాలీబాల్ పురుషులు: సిద్ధవటం, మైదుకూరు, జమ్మలమడుగు

వాలీబాల్ మహిళలు: కడప, మైదుకూరు, పులివెందుల

మంగంపేటపై సీఎంకు ప్రత్యేక అభిమానం


ఓబులవారిపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంగంపేట అంటే ప్రత్యేక అభిమానమని ఎండీ వి.జి. వెంకటరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మంగంపేట కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాలకు మెరుగైన పునరావాస పరిహారం అందిస్తామన్నారు. మంగంపేట పంచాయతీలోని వృద్ధులకు ఏపీఎండీసీ ద్వారా రూ. 2వేలు ప్రత్యేకంగా పింఛన్‌ను అందిస్తున్నామని తెలిపారు. మంగంపేట అగ్రహారం గ్రామ ప్రజలు ఎండీతో మాట్లాడుతూ తమకు ప్రస్తుతం మార్కెట్ ధర చెల్లిస్తూ ముక్కావారిపల్లె పంచాయతీలోని జాతీయ రహదారి పక్కన ఉన్న స్థలంలో పునరావాసం కల్పిస్తున్నట్లు కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. తమకు ముందు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం పునరావాస పరిహారం చెల్లించాలని కోరారు. పదిరోజుల్లో సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని ఎండీ పేర్కొన్నారు.

పుష్పగిరి హుండీ ఆదాయం లెక్కింపు

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరి కొండ పైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. శ్రీ చెన్న కేశవ స్వామి ఆలయంలో దేవదాయ శాఖ అధికారులు, భక్తుల సమక్షంలో ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల ద్వారా భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలను లెక్కించారు. ఇందులో రూ 3,21,795 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ జనార్దన్, అర్చకులు అఖిల్ దీక్షితులు, సుమంత్ దీక్షితులు, పురావస్తు శాఖ, దేవదాయ శాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్ డబుల్ ఓట్ల తొలగింపు

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు మేరకు టీడీపీ నేతల ఓట్లను అధికారులు తొలగించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డితోపాటు ఆయన సతీమణి మౌనిక రెడ్డి, సోదరుడు ప్రదీప్ కుమార్‌రెడ్డి, హిమజ రెడ్డి, తండ్రి గండ్లూరు వీరప్రతాప్‌రెడ్డి, పద్మావతమ్మ ఓట్లు మున్సిపాలిటీ పరిధిలోని వైఎంఆర్ కాలనీలో ఉండేవి. అలాగే ప్రవీణ్ కుమార్‌రెడ్డి పెద్దనాన్న, కమలాపురం మాజీ ఎమ్మెల్యే గండ్లూరు వీరశివారెడ్డి, ఆయన సతీమణి రాజేశ్వరమ్మ, కుమారుడు వీర అనిల్ కుమార్‌రెడ్డి, సునీత ఓట్లు కూడా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని వైఎంఆర్ కాలనీతోపాటు కమలాపురం నియోజకవర్గంలోని కోగటం గ్రామంలో ఉండేవి. నెల రోజుల క్రితం 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు విచారణ జరిపి నోటీసు ఇచ్చారు. దీంతో ప్రవీణ్ కుమార్‌రెడ్డితోపాటు ఆయన సతీమణి ఓట్లను ప్రొద్దుటూరులోనే ఉంచుకుని కోగటం గ్రామంలో రద్దు చేసుకున్నారు. తల్లిదండ్రుల ఓట్లు మాత్రం ఇక్కడ తొలగించుకుని కోగటంలో ఉంచుకున్నారు. అదే తరహాలో మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డితోపాటు ఆయన కుటుంబీకులు ప్రొద్దుటూరులో ఓట్లు తొలగించుకుని కోగటంలో ఉంచుకున్నారు.



కమలాపురం నియోజకవర్గ ఓటర్ల జాబితాలో టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్ ఓటు (ఫైల్)

తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధిదీ అదే పరిస్థితి

టీడీపీకి చెందిన తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు కుటుంబీకులు స్థానిక శ్రీరాములపేటలో నివాసం ఉంటున్నారు. నల్లబోతుల నాగరాజుతోపాటు ఆయన కుటుంబీకులకు చెందిన మొత్తం 11 ఓట్లు ఇటు ప్రొద్దుటూరు మున్సిపాలిటీలోనూ అటు ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదుర్తి గ్రామంలో ఉండేవి. ఈ విషయంపై వైఎస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదు చేయడంతో స్థానిక ఎన్నికల అధికారులు ఎర్రగుంట్ల తహసీల్దార్ నాగేశ్వరరావుకు లేఖ పంపారు. ఆయన విచారణ జరిపారు. నల్లబోతుల నాగరాజుతోపాటు నాలుగు ఓట్లను ప్రొద్దుటూరులో ఉంచి మిగతా 7 ఓట్లను జమ్మలమడుగు నియోజకవర్గం ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తిలో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

రైతు విలువను తెలిపే పని అనుభవ కార్యక్రమం

మైదుకూరు : వ్యవసాయ సంబంధిత కోర్సులు చదువుతున్న విద్యార్థులకు పని అనుభవ కార్యక్రమం (ఆర్‌హెచ్‌డబ్ల్యూ ఈపీ) రైతుల విలువలను తెలియజేస్తుందని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎస్.గోపాల్ అన్నారు. అనంతరాజుపేట ఉద్యాన కళాశాల విద్యార్థినులు శనివారం మైదుకూరు మండల సుంకులుగారిపల్లెలో పని అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతు సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు పని అనుభవ కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల మరింత పరిణతి చెంది, విధి నిర్వహణలో బాధ్యతగా ఉంటారని తెలిపారు. ఉద్యాన కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రామయ్య మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం రైతులకు ఎంతగానో లాభదాయకమని అన్నారు. సేంద్రియ వ్యవసాయంతో పండించిన ఫలసాయాలు వినియోగించడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం పరిధిలో అతిథ్య గ్రామాలైన విశ్వనాథపురం, టి.కొత్తపల్లె, సుంకులుగారిపల్లె గ్రామాలకు చెందిన రైతులు ఉద్యాన కళాశాల విద్యార్థులకు పని అనుభవ కార్యక్రమంలో ఎంతో సహకరించారని పేర్కొన్నారు. కాశినాయన మండలం ఉద్యాన అధికారి రామకృష్ణ మాట్లాడుతూ పీఎంఈఎం ద్వారా అందే సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకొని, విలువ ఆధారిత పదార్థాల తయారీని చేపట్టాలని సూచించారు. సదస్సులో అనంతరాజుపేట ఉద్యాన కళాశాల విద్యార్థినులు తమ కార్యక్రమాలపై ప్రచురించిన కరపత్రాలను అధ్యాపకులు, శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.శ్రీవిద్య, డాక్టర్ బీఎస్ కాంతిశ్రీ, ఉద్యాన కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ దీప్తి కిరణ్, డాక్టర్ దినేష్ పని అనుభవ క్యార్యక్రమానికి ఇన్‌చార్జిలుగా వ్యవహరించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్, డాక్టర్ లావణ్య, సుంకులుగారిపల్లె గ్రామ నాయకుడు దశరథరామిరెడ్డి, రైతు నాయకుడు బీపీ ప్రతాప్‌రెడ్డి, టి.కొత్తపల్లె సర్పంచ్ బండి నాగేంద్ర, కేవీకే అతిథ్య గ్రామాలకు చెందిన మహిళా రైతులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు

రోబోటిక్ టెక్నాలజీ ద్వారా కీళ్ల మార్పిడి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీతో మోకాలు, తుంటి కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు రాయలసీమలోనే ప్రప్రథమంగా అందుబాటులోకి తెచ్చామని విద్యాసాగర్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. శనివారం తన ఆస్పత్రిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికాకి చెందిన స్మిత్ – నెప్యూ కంపెనీ కి చెందిన రోబోటిక్ సిస్టంను గత కొన్ని రోజులుగా ఉపయోగించి సంతృప్తికరమైన సత్ఫలితాలను పరిశీలించిన తర్వాతనే తమ ఆస్పత్రిలో రోబోటిక్ టెక్నాలజీ ద్వారా మోకాలు, తుంటికీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేస్తున్నామన్నారు. రోబోటిక్ టెక్నాలజీని డిజైన్ చేసిన బృందంతో చర్చించిన తర్వాత ఈ టెక్నాలజీని తీసుకు రావడం జరిగిందన్నారు. రోబోటిక్ టెక్నాలజీ ద్వారా వంద శాతం ఖచ్చితత్వం, సంతృప్తికరమైన సత్ఫలితాలు వంటి అనేక లాభాలను ఆయన వివరించారు. తమ ఆస్పత్రిలో నిష్ణాతులైన వైద్య బృందంతో శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేస్తున్నామన్నారు. అనంతరం రోబోటిక్ టెక్నాలజీ ద్వారా మోకాలు శస్త్ర చికిత్స చేయించుకున్న పేషంట్లు తమ సంతృప్తిని మీడియాతో పంచుకున్నారు. విద్యాసాగర్ రెడ్డి రోబోటిక్ టెక్నాలజీ ద్వారా మోకాలు, తుంటి కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స విధానాన్ని ఆపరేషన్ థియేటర్‌లో వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్ ఆర్థోపెడిక్ ఆస్పత్రి సీఈఓ ఎస్.సురేష్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

యురేనియం కర్మాగారాన్ని సందర్శించిన జేసీ



యురేనియం అధికారులతో చర్చిస్తున్న జేసీ గణేష్‌కుమార్, తదితరులు

వేముల : మండలంలోని తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టును జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ శనివారం సందర్శించారు. యురేనియం పరిశ్రమ మైనింగ్ కార్యకలాపాలపై అక్కడ అధికారులతో ఆరాతీశారు. మైనింగ్‌లో జరిపే తవ్వకాలను వీడియో ద్వారా తిలకించారు. మైనింగ్ పనులను స్వయంగా పరిశీలించారు. అనంతరం మిల్ హౌస్, బాల్‌మిల్, రాడ్‌మిల్‌తోపాటు అక్కడే ఉన్న ఆటో క్లేవ్‌ను సందర్శించారు. అనంతరం కెమికల్ హౌస్ చేరుకొని యురేనియం తయార్యే విధానాన్ని గమనించారు. యురేనియం ప్రాజెక్టులో అధికారులతో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశులు, తహసీల్దార్ భగవతి, డీజీఎం సుమన్ సర్కార్, మైన్స్ ఏజెంట్ కిషోర్‌భగత్, మైన్స్ మేనేజర్ శేఖర్‌బాబు, చీఫ్ మేనేజర్ సంజయ్ చటర్జి, సూపరింటెండెంట్ నవీన్‌కుమార్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ బీటీ రావ్, అధికారులు పాల్గొన్నారు.

పరిపూర్ణంగా అనుగ్రహించే తల్లి లూర్దుమాత

కడప కల్చరల్ : లూర్దుమాత మానవాళిని పరిపూర్ణంగా అనుగ్రహించే తల్లి అని బద్వేలు విచారణ గురువులు రెవ ఫాదర్ గొడుగునూరు విజయరావు అన్నారు. స్థానిక మరియాపురంలో శనివారం లూర్దుమాత తిరునాల మహోత్సవం రెండవ రోజు రెవరెండ్ ఫాదర్ లక్కినేని ఆరోగ్యరాజు దివ్యబలి పూజను సమర్పించగా, విజయరావు దేవుని సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరినీ అనుగ్రహించి వారిని పాపాల నుంచి దూరం చేసేలా అనుగ్రహించే మాత అందరికీ సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. మనుషుల మధ్య ఐక్యత కొరవడిందని, కుటుంబాలలో శాంతి సమాధానం సన్నగిల్లుతోందని, ప్రార్థనాలయాల సంఖ్య పెరుగుతున్నా, ప్రార్థనలు చేసే వారు ఎక్కువ అవుతున్నా సమాజంలో అరాచకాలు ఏమాత్రం తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పూజ ప్రారంభంలో బద్వేలు విచారణకు చెందిన విశ్వాసులు ప్రత్యేకంగా అలంకరించిన లూర్దుమాత తేరును పురవీధుల ద్వారా ఊరేగింపుగా ప్రార్థనలు చేస్తూ సాగారు. విచారణ గురువులు , విశ్వాసులు పాల్గొన్నారు.



సందేశం ఇస్తున్న విచారణ గురువు

ఆర్ట్స్‌కాలేజీ రోడ్డులో చోరీ

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఆర్ట్స్‌కాలేజీ రోడ్డులోని సంజీవరాయుడు ఇంట్లో చోరీ జరిగింది. సంజీవరాయుడు శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆళ్లగడ్డ మండలంలోని పడకండ్లలో జరిగిన నరసింహస్వామి పారవేట ఉత్సవానికి వెళ్లాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంటి తలుపులు తెరచి ఉండటంతో స్థానికులు సంజీవరాయుడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు హుటాహుటిన ప్రొద్దుటూరుకు వచ్చారు. ఇంట్లోని బీరువాలో పరిశీలించగా రూ. 40 వేలు నగదు, ఒకటిన్నర తులం బంగారు కనిపించలేదు. వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

దుకాణాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

– ఉప కార్మిక కమిషనర్ శ్రీకాంత్‌నాయక్



కమిషనర్ శ్రీకాంత్‌నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న వ్యాపారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని దుకాణాలు, సంస్థలు ఏర్పాటు చేసే వారు తాము ఏర్పాటు చేసే సంస్థలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఉప కార్మిక కమిషనర్ బి.శ్రీకాంత్‌నాయక్ తెలిపారు. శనివారం తమ కార్యాలయంలో పలువురు వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాల, సంస్థల చట్టం–1988 కింద తప్పనిసరిగా నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలన్నారు. ఈనెల 29వ తేదీ లోపు ప్రతి దుకాణాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అనంతరం దుకాణదారులు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో హోల్‌సేల్, మెడికల్ దుకాణ యజమానుల అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయులు, ఫార్మసీ జిల్లా అధ్యక్షుడు టి.నరసింహమూర్తి, కిరాణా మర్చంట్ అసోసియేషన్ నాయకులు జీవీ సుబ్బయ్య, రియాజుద్దీన్, రాజేష్ కుమార్, శ్రీనివాసులురెడ్డి, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 20 కుటుంబాలు చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులోని 20 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు డేవిడ్, కౌన్సిలర్ భాస్కర్‌ల ఆధ్వర్యంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి , మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్ రెడ్డిల సమక్షంలో వీరికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో సామేల్, ప్రతాప్, లాజర్, బాబు, సురేష్, సిరిల్, వికాస్ తదితరులు ఉన్నారు.

హిందీ ఒలంపియాడ్ పరీక్షల్లో 'భారతి' విద్యార్థుల ప్రతిభ



హిందీ ఒలంపియాడ్ పరీక్షల్లో విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపల్ కిషోర్ కుమార్

కమలాపురం : మండల పరిధిలోని నల్లింగాయపల్లెలో ఉన్న డీఏవీ భారతి విద్యా మందిర్ విద్యార్థులు హిందీ ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ చాటి బంగారు పతకాలు సాధించారు. గత అక్టోబర్ నెలలో స్వామి వివేకానంద ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ ముంబయి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ ఒలంపియాడ్ పరీక్షల్లో 3వ తరగతికి చెందిన యస్. హృషి కేశవరెడ్డి, 4వ తరగతికి చెందిన పి.గురు రోహిత్‌రెడ్డి, 6వ తరగతికి చెందిన రేణుక ప్రహర్ష ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాలను సొంతం చేసుకున్నారు. కాగా నిర్వాహకులు వారికి పతకాలతో పాటు ప్రశంసా పత్రాలు సంభాషణ పుస్తకాలను అందజేశారు. అలాగే ఈ పాఠశాలలోని అన్ని తరగతుల్లో 75 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాసి ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ తెలిపారు. కాగా శనివారం విద్యార్థులతో పాటు హిందీ ఉపాధ్యాయులు శివ మాధవి, పద్మావతిలను హెచ్‌ఆర్ చీఫ్ మేనేజర్ గోపాల్‌రెడ్డి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన మస్తాన్‌వలీ, అమీరుద్దీన్

అట్లూరు : మండల పరిధిలోని లింగాలకుంట సమీపంలో కడప–బద్వేలు ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు కడపకు చెందిన షేక్ మస్తాన్‌వలీ(49), షేక్ అమీరుద్దీన్(54)ద్విచక్రవాహనంపై బద్వేలు పట్టణానికి బయలు దేరారు. లింగాలకుంట చెరువు సమీపానికి వచ్చే సమయానికి నడిరోడ్డుపై ఏర్పడిన గుంత దగ్గర అదుపుతప్పి ద్విచక్రవాహనం కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో సిద్దవటం సీహెచ్‌సీకి తరలించారు.

మద్యం సీసాలు స్వాధీనం

పోరుమామిళ్ల : రంపాడు రోడ్డులో శనివారం సుగతి పరశురాం వద్ద 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. అలాగే సీతారాంపురం క్రాస్‌రోడ్డులో టేకూరుపేటకు చెందిన గుజ్జుల వెంకటేశ్వర్లు, నారాయణ అక్రమంగా విక్రయిస్తున్న 27 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులు ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



నూతన సాంకేతిక ఆవిష్కరణలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్స్

కమలాపురం : ప్రతి విద్యార్థి సమాజానికి ఉపయోగపడే నూతన సాంకేతిక ఆవిష్కరణలపై దృష్టి సారించాలని కడప, ప్రొద్దుటూరు, రాయచోటి పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపల్స్ శ్రీనివాసరావ్, జగదీశ్వరుడు, శివశంకర్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపల్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధ్యాపక బృందం పర్యవేక్షణలో ఆ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన టెక్‌ఫెస్ట్-2024ను వారు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన 32 ప్రాజెక్ట్‌లను పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులన్నీ ప్రజల దైనందిన జీవితాలకు సంబంధించినవి, రైతులు, పరిసర ప్రాంతాల ప్రజలకు అవసరమయ్యేవి కావడంతో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పందుల చోరీపై కేసు నమోదు

ముద్దనూరు : మండల కేంద్రంలో 50 పందులు చోరీకి గురైనట్లు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం తమ పందులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ముద్దనూరుకు చెందిన సుబ్బమ్మ అనే మహిళ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు.